

# చంద్రగ్రహణం

## ఆకెళ్ళ





బో డిపాలెంలో చంద్రంబాబు కంటి శిబిరం పెడితే జనం విరగబడి వచ్చేరు. పాత సత్రానికి ఆనుకుని వేసిన ఆ కంటి శిబిరంలో జనాన్ని కూర్చోపెట్టడం కష్టమయింది.

చంద్రంబాబు ఎవరంటావా? చంద్రంబాబు కౌస ల్యమ్మ కొడుకు. ఏంటి కౌసల్యమ్మ ఎవరంటావా? అయితే నీ పేరు ఓటర్ లిస్టులో లేదన్నమాట. నీదీ జిల్లా కాదన్నమాట. ఈ జిల్లానే కాదు చుట్టు పక్కల నాలుగు జిల్లాల్లో కౌసల్యాదేవి మకుటం లేని మహారాణి, జిల్లాకొచ్చే మంత్రులేంటి! పార్ల మెంటు మెంబర్లేంటి అంతా కౌసల్యమ్మ ఇంటికొచ్చి వెళ్ళాల్సిందే. గవర్నమెంట్ కంట్రాక్టులు, ప్రైవేటు కంట్రాక్టులు అన్నీ ఆవిడవే.. ఆవిడ ఒక్కగానొక్క కొడుకు డాక్టర్ చంద్రంబాబు.

చంద్రంబాబుని నువ్వు చూడలేదు కదూ. చంద్రంబాబుది చందమామ కంటే అందమైన ముఖం. చంద్రుడి ముఖంలో మచ్చలున్నాయి. మా బాబు మొకంలో ఆలాంటివేం లేవు. అయితే, చంద్రుడికి మా బాబుకి ఒక్క విషయంలో పోలి కుంది.


వువ్వు వుట్టగానే పరిమళం అంటారు కదా. అలాగే మా బాబు వుట్టగానే పరిమళించడం మొదలెట్టాడు. ఏడో ఏట నీళ్ళు పోసే దాసీమనిషి చంద్రంబాబు చూపులు బాగోలేవని పనిమానేసి వెళ్ళిపోయింది. పదహారో యేట లెక్కల మేస్టారి సంసారానికి ఎసరొచ్చింది. పెళ్ళాన్ని వేసుకుని మేస్టారు ఊరొదిలి పారిపోవాల్సి వచ్చింది. ఈ విషయంలోనే చందరబాబుది చంద్రుడి పోలిక. కామరాజని, లేడీస్ కింగని, మా బాబుకి కాలే జీలో చాలా పేర్లుండేవి. వయసులో వున్న ఆడదాన్ని చూస్తే.. మా బాబు నిలబడలేడు. అది మా బాబు వీక్నెస్.

కాలేజీలో మార్కులు రాకపోయినా చంద్రం బాబు కంటి డాక్టర్ కావాలని, కౌసల్యమ్మ ఆశప డింది. డొనేషన్ల కాలేజీల పుణ్యమాని డిగ్రీ కొనే సింది. చంద్రంబాబు కంటిడాక్టరయిపోయాడు. బోడిపాలెం అంటే మరీ చిన్న ఊరేం కాదు. ఆరువందల గడప వున్న ఊరు. ఆ ఊళ్ళో చంద్రంబాబు కంటి శిబిరం ఎట్టేసరికి కళ్ళల్లో పువ్వులు వేసినాళ్లు, కంటిచూపు దెబ్బతిన్నవాళ్ళు, దూరదృష్టివాళ్ళు, దగ్గర దృష్టి వాళ్ళు, ముసలీ ముతక, పిల్లామేక అంతా మా డేరా దగ్గరకు చేరిపోయారు.

"బోడిపాలెం మీ ఊరే గన్క– నువ్వు చంద్రం బాబుతో వెళ్ళరా.." అని కౌసల్యమ్మ నన్ను పంపింది.

అది సరే అంత పెట్టుబడి పెట్టి ఇతర రాష్ట్రాల్లో చదువు'కొన్న'వాడేంటి! బోడిపాలెంలో ప్రజాసేవకి ఈ కంటిశిబిరం ఏంటని నీకు అనుమానం రావచ్చు. వచ్చిందా? అంటే నువ్వు మరో జన్మకయినా బాగుపడవు.

కొత్త కత్తి ఏదయినా కొన్నామనుకో. పదును దేరేదాకా కనబడ్డ కూరముక్కనో, గడ్డివువ్వునో.. పేపర్ ముక్కనో.. కత్తిరించమా? అదే మోడల్‌లో పది కళ్ళు కత్తిరించి, కంటి ఆపరేషన్‌లో పదును నేరడానికి మా చంద్రం బాబు బోడిపాలేనికొచ్చి కంటి శిబిరం తెరిచేడు. పదిమందిని పంపితే కాని డాక్టరు కాడని పెద్దలే చెప్పారు. పది కళ్ళు పొడిచి డాక్టర్ కావాలని వచ్చాడు మా బాబు.



● ప్రఖ్యాత సినీ రచయిత, కథారచయిత
శ్రీ ఆకెళ్ళ ఆంధ్రజ్యోతి కోసం ప్రత్యేకంగా రాసిన కథ

ఆ ఊళ్ళో మేం అడుగుపెట్టిన మూడోనాడు.. ఓ పిల్ల మా డేరా కొచ్చింది. ఆ పిల్ల ఎలా వుందనుకున్నావ్.. మెరుపుతీగ ఆకాశంలోంచి దిగి వచ్చినట్టుంది. ఆవిడ అందాల్ని మోయలేక నడుం సన్నగా చిక్కిపోయి వుంది. ఆ నడుం మీద బుగ్గ చుక్కలాంటి బొడ్డు. పాదాలు చూడడానికే పావలా టిక్కెట్టు పెట్టి రోజుకు పదివేలు కలెక్షన్ లాగచ్చు. అట్టా వున్నాయా పాదాలు. తలనుంచి, కాలి బొటనవేలి వరకు వెన్నెల దీపంలా వుంది. అయితే ఆ దీపం వెనుక ఏదో చీకటి వున్నట్టు చూడగానే అర్థమైంది. ఏ మచ్చ లేకుండా చెయ్యాలని ఆ దేవుడు నుదుటిమీద బొట్టు కూడా చెరిపేశాడని తెల్సింది. ఆ పిల్లపేరు చిట్టితల్లిట.

ఆరునెలల క్రితం చిట్టితల్లి మొగుడు మిల్లులో పనిచేస్తుంటే కాలు మిషన్ చక్రంలో ఇరుక్కుపోయిందట. మంచంమీద మూడునెలలు వుండి ఇంట్లో వున్న సామాను అంతా అంగడికి వెళ్ళిపోయిన తర్వాత, అతగాడు నేలమీద పాకే నెలల బిడ్డడ్ని, నేలకి ఒరిగిపోతున్న ముసలి తండ్రిని చిట్టితల్లికి అప్పగించి కన్నుమూసేడట.

మొగుడు పోయిన తర్వాత ఎన్నడూ అడుగు బయటపెట్టని చిట్టితల్లి.. కంటిచూపు అగపడని మావని వేసుకుని ఆరోజె అడుగు బయటపెట్టిందట. డేరాలో వాళ్లు చెప్పారు. కంటి డేరాలో చిట్టితల్లి అడుగెట్టేసరికి– ముందు మా చంద్రం బాబుకి కంటిచూపు పడిపోయింది. ఆ పిల్ల వెలుగుకి షాక్ కొట్టినట్టు అయిపోయాడు. మిగతావాళ్ళని పక్కనెట్టి, చిట్టితల్లిని మావని ముందుకు రమ్మన్నాడు.

ఆ మావ ఎలా వున్నాడంటే గాలి వీస్తే పడిపోయేలా లేడు. మనం తుమ్మితే పడేలా వున్నాడు.




అరవైయేళ్ళు వుండొచ్చు కాని అరవై వసంతాలు చూసినవాడిలా లేడు. యనభై గ్రీష్మాలు చూసిన వాడిలా వున్నాడు. ఒంటిమొత్తానికి అరగజం గుడ్డ సరిపోయే మాంసమే వుంది. ఆతన్ని చూస్తే దరిద్రంతో వున్నట్టు లేదు. దరిద్రాన్ని ఆరాధిస్తున్నట్టు వున్నాడు. ఆమాత్రం నీడ లేకపోతే దరిద్రం ఎలా బతకాలి అనిపించింది అతన్ని చూసిన తర్వాత.

ఏదెతేనేం.. మా చంద్రంబాబు బాగానే చూశాడు. నారడి గుండెల్ని పరీక్షగా చూశాడు. చినిగిన రైక లోంచి పసుపుముద్దల్లా కనబడుతున్న చిట్టితల్లి గుండెల్నీ చూశాడు.

నారడి పొట్ట నొక్కిచూస్తూ విల్లుబద్దలా వున్న చిట్టి పొట్టని, విల్లుబద్దకున్న చిట్టి బొడ్డుని చూశాడు.

నారడి కళ్ళలోకి చూస్తూనే చిట్టితల్లి కళ్ళలో మా బాబు కళ్లు కలిపేడు కాని చిట్టితల్లికి అర్థం కాలేదు. అయితే రెప్పవాల్చకుండా ఒంటి బిగువుని కళ్ళతోనే మా బాబు తాగేస్తున్నాడని గ్రహించి పమిట సర్దుకుంది. వెంటనే నారడ్ని పరీక్ష చెయ్యడం ఆపేసేడు మా బాబు.

"ఇంత ఆలస్యం చేసేవేంటి? వెంటనే ఆపరేషన్ చెయ్యకపోతే గుడ్డోడు అయిపోతాడు" అంటూ మా భాబు అరిచేడు.

చిట్టితల్లి చింతాకులా వణికిపోయింది. "బాబూ! ఆ ముసలాయన గుడ్డోడు అయితే– మా బ్రతుకులు చీకటి అవుతాయి. మా చంటోడికి ఓ దారి చూపాల్సిందీయనే. ఆయనకే చూపులేకపోతే ఎట్టా! చూపు ఇప్పించండి బాబు" అంటూ కాళ్ళావేళ్ళా పడింది. చంద్రం బాబు శానాసేపు మాట్లాడలేదు. ఆమెకు కంగారెక్కువయింది.

ఆ తర్వాత మా బాబు "ఆపరేషన్ నేను ఫ్రీగా చేస్తా! మందులు కొనుక్కుంటావా!" అని అడిగేడు.

"పిల్లాడి పాలపీక కొనడానికి కూడా వాకాడ







డబ్బుల్లేవు" అంటూ వనలక్ష్మిలా ఏడ్చింది చిట్టితల్లి. అప్పటికి పరిస్థితి అర్థమయిన ముసలాడు మా బాబు పాదాలు పట్టుకుని వదలలేదు. వాళ్ళని బాగా ఏడవనిచ్చి "సాయంత్రం రా మాట్లా డదాం" అన్నాడు మా బాబు. చిట్టితల్లి తలూపి వెళ్ళిపోయింది.

ఆ సాయంత్రం చిట్టితల్లి వచ్చిందా? అంటావా! వచ్చింది. అయితే మీ బాబుతో ఏం మాట్లా డిందో, మా బాబు ఏటన్నడో నాకు తెల్దు కాని- వచ్చింది వచ్చినట్టే వదిలిన బాణలా పరుగెత్తింది. అయితే మూడురోజుల తర్వాత నా కంటిముందు జరిగింది చూసిన తర్వాత నాకంతా అర్థమైంది.

ఆ సాయంత్రం.. నీతి డబ్బు ఎనక చేరిపోయి నట్టు, సూర్యుడు మబ్బు ఎనక చేరిపోయాడు. డబ్బున్నవాళ్ళు- పండగనాడు ఒకళ్ళనొకళ్ళు కావలిం చుకున్నట్టు- మబ్బులు చిక్కగా పెనవేసుకున్నాయి. ఉన్నోళ్ళు- గ్లాసులెత్తి సీర్స్ కొడితే- జేరిన మంచు ముక్కల్లా ఆకాశంలోంచి ఒకటి అరా చినుకు రాల్తోంది.

అలాంటి వేళలలో మా బాబు.. వేడినీళ్ళతో స్నానం చేసి మన్మదుడికి తమ్ముడిలా తయార య్యేడు. మా బాబునించి గుమగుమలాడుతు వాసనొచ్చింది. అది వంచిన నడుం ఎత్తకుండా కోతలు కోసిన ఆడకూలి మోచేతి చెమట వాస నలా లేదు. సల్ల మిషన్ వున్న గదిలో లవండర్ ఒలిగిన వాసనలా వుంది.

కొంచెం కనుచీకటి పడుతుంటే- తక్కుతు, తారుతు చిట్టితల్లి మా సత్రంకేసి రావడం చూశాను. మా బాబు నన్ను లోపలకెళ్ళిపొమ్మన్నాడు. వెళ్తూ- నా చెవులు అక్కడ గోడకి తగిలించి వెళ్ళాను.

మనసుకేదో అనుమానం కల్గింది. అది నిజం కాకూడదని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంటు కూచు న్నాను. అయితే వెయ్యిదేవుళ్ళు నన్ను పక్షపాతం లేకుండా మోసం చేశారు. ఆ గదిలోంచి మూలు గులు రావడం మొదలెట్టాయి. అయితే ఆ మూలుగులు సింహం గదిలో ఇరుక్కున్న మేకపిల్ల మూలుగులా వినిపించింది. బల్లి నోట్లో వున్న పురుగు రెక్కలు విదిలించిన శబ్దం వినిపించింది.

లోపలేం జరిగిందో.. నేను చూడలేదు. నేనే కాదు. లోకంలో జరిగే సరసాలన్నీ చూసే చంద మామ కూడా... మా చంద్రంబాబు సరసం చూసి.. మరో మచ్చ తెచ్చుకోవడం ఇష్టంలేక మబ్బుచాటుకి వెళ్ళిపోయాడు.

వస్తువు మనది అంటే జేగ్రత్తగా చూసుకుంటాం- మన్ది కాదు. మళ్ళా చేతికి దొరకదు. అంటే?

చంద్రంబాబు పూతరేకులాంటి ఆపిల్ల ఒంటిమీద బట్టలే ఒల్చేడో.. కోడి మెడ కొరికే అలవాటున ఆ పిల్ల తొడలే కొరికేడో.. పసిపిల్లాడి ఉసురోసు కుని- వాడి తిండే కొల్లగొట్టాడో తెలీదు. నేను చూడలేదు కాని ఆ ఘోరం చూసిన పాత సత్రం కప్పు. చూడలేక తల తిప్పకోవటం వల్ల కావచ్చు, కప్పమీంచి కొన్ని పెంకులు నేల రాలిపడ్డాయి.

పగిలే ఆ పెంకుల శబ్దంలోంచి ఆపరేషన్ చేస్తారుగా! కళ్ళు వస్తాయిగా! రెండు మాటలు.. దారం తెగిన పువ్వుల్లా విడివిడి అక్షరాలుగా వినిపించాయి.

ఆంధ్రజ్యోతి కోసం
ప్రత్యేకంగా
పదిహేనేళ్ళ తర్వాత
కొమ్మనాపల్లి
గణపతిరావు రాసిన
'అనకాపల్లి
అమ్మాయి'
కథ
వచ్చే సంచికలో

ఆ తర్వాతో పావుగంటకా పిల్ల- చీర చుట్టు కుని జలపాతంకేసి వెళ్ళటం నేను చూసి వెనకనే పరుగెత్తాను. అఘాయిత్యానికి తలపడుతుందని భయపడ్డాను. కాని జలపాతం ముందుకు రాగానే.. చిట్టితల్లి కూలబడింది- మోకట్లో, తలదాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. ఉప్పెనలా ఆమె గుండె ల్లోంచి దుఃఖం పెల్లుబికి వచ్చింది. సచ్చిపోయిన మొగుడు కోసం ఏడుస్తోందో, విడిచిపెట్టిన శీలం కోసం ఏడుస్తోందో, ఇద్దరు పిల్లల్ని ఎలా సాకాలని ఏడుస్తోందో నాకర్థం కాలేదు.

ఆ ఏడుపు వింటే సావు అయినా సరే గుండె పగిలి చావాల్సిందే. అలా వుందా ఏడుపు.. ఆమెకు సానుభూతిగా సర్వీచెట్లు కూడా సన్నగా రొదపెడుతూ ఏడవసాగేయి. ఆ ఏడుపు నా గుండెని పొరలు పొరలుగా కోత పెట్టసాగింది. ఉండబట్టలేక ఓదార్చాలని ముందుకో అడుగు వేశాను.

అయితే ఎలా ఓదార్చను. గట్టు తెగితే కట్టు వేయగలం- సముద్రం పొంగితే.. మాటలు నిలుస్తాయా, మూటలు నిలుస్తాయా! నా వల్ల కాదనిపించింది. నా గుండె చిక్కబట్టుకునేందుకు, నా కాళ్ళలో శక్తి నేను తిరిగి తెచ్చుకునేందుకు ఆమెకి దూరంగా నేలమీద కూలబడిపోయాను.

చాలాసేపు ఏడ్చిన తర్వాత చిట్టితల్లి వెళ్ళి జల పాతం దగ్గర తలస్నానం చేసింది. స్నానం చేసి నిర్లిప్తతగా ఇంటికెళ్ళిపోయింది.

వేళకాని వేళ స్నానం చేసి.. తడిబట్టల్తో- చిట్టితల్లి ఇంటికెళ్ళడం చూసేక దేవుడు చచ్చి పోయాడని కబురుతెల్సి చిట్టితల్లి చావుస్నానం చేసిందా! అనిపించింది.

ఆ మర్నాడు.. నారయ్యకు మా బాబు సాయంగా ఆపరేషన్ చేసి కట్టుకట్టాడు. ఏ భయం లేదని చిట్టితల్లి ఒంటిమీద చేయివేసి ధైర్యం చెప్పాలని మా చంద్రంబాబు ప్రయత్నం చేశాడు కాని చిట్టితల్లి దూరంగా వెళ్ళిపోయింది.

కంటి శిబిరం రెండునాళ్ళలో ఎత్తేస్తారనగా కాబోలు.. నారయ్యని తీసుకుని మళ్ళా వచ్చింది చిట్టితల్లి. సాయంగా మా బాబే నారయ్యకి కట్టు విప్పేడు కాని కళ్ళు మాత్రం రాలేదు.

దాంతో చిట్టితల్లికే కాదు. నాకూ గుండె ఆగి పోయింది. "చూపు వస్తుందన్నారు" పూడుకుపో యిన గొంతులోంచి మాట బయటకు రాలేదు చిట్టితల్లికి.


"అనుకున్నాను. కాని ముసలాయన కనుగు డ్డుకు ఆ శక్తి లేనట్టుంది. మన ప్రయత్నం మనం చేశాం. మనమొకటి తలిస్తే దైవమొకటి తలుస్తాడు" బాబు వేదాంతిలా చెప్పాడు.

చిట్టితల్లి కళ్ళలోంచి నీళ్లు వస్తాయనుకున్నాను. రాలేదు. అట్టా చూస్తూ వుండిపోయింది. గుండె కార్చే కన్నీరు నా యధవ కంటికి ఎలా కన బడతుంది.. గుండె రక్తం కక్కిందేమో నాకు తెలవదు.

ఆ ముసలాడు మాత్రం పొర్లి పొర్లి ఏడ్చేడు. మనవడ్ని ఎలా పెంచాలనుకున్నాడో.. చెబుతూ ఏడ్చేడు. తన ఆశలు ఎలా నిరాశ అయ్యాయో చెప్పకుంటూ ఏడ్చేడు. తన కొడుకుతో తన్ని ఆ దేవుడు ఎత్తుకుపోలేదని ఏడ్చేడు. కొండనాలికకు మందేస్తే వున్న నాలిక పోయిందన్నట్టు చూపు ఇంకా మందగించిందని- చిల్లుకుండలా అలా ఏడుస్తూనే వున్నాడు. ఆ ఏడుపు వినలేక నేను చెవులు మూసుకుని అక్కడ్నించి వెళ్ళిపోయాను.

ఆ రాత్రి బాబు అన్నం తింటుంటే అడిగేను "ఆ ముసలాడికి చూపు తెప్పిస్తారని ఆశపడ్డాను,

# ఇండ్ల రామసుబ్బారెడ్డి గారూ!



మిమ్మల్ని నేను సీరియస్‌గా
లవ్ చేస్తున్నా ఇట్లు
మీ
లవర్ ఎవరా లవర్! ఏమిటీ లవ్ స్టోరీ!

వివరాలకు వచ్చే సంచిక చూడండి!

అట్టా చేసేరంటి" అని అడిగేను.

"ఆడికి కళ్ళు వచ్చే అవకాశం లేదురా. నేను ఏం చేసినా ఆడికి చూపు రాదు. పైగా నాకు ఆపరేషన్ చెయ్యడం రాదని. కనుగుడ్లని వేరుశెనగ గుడ్లలా పొడిచేస్తున్నానని పెద్ద డాక్టర్ తిట్టేడనేగా నేర్చుకోవడానికి ఈ ఊరొచ్చింది" అన్నాడు మా బాబు.

నేను.. తెల్లబోయాను.

"మరి కళ్ళు వచ్చే ఛాన్సు లేకుంటే ఆపరేషన్ ఎందుకు చేసినట్టు!"

"చిట్టితల్లి అందం ఆశపెట్టింది. దాని ఒంటి మీద గుడ్డలు విప్పటానికి ముసలాడి కంటికో గుడ్డ చుట్టేను" తమాషాగా నవ్వేడు చంద్రంబాబు.

నేను అసహ్యంతో తలతిప్పుకున్నాను. అప్పుడే అక్కడ నిలబడి ఈ మాటలు వింటున్న ఆ ఊరి వంటలక్క, గబగబా వెళ్ళిపోయింది. వెళ్ళి ఈ మాటలు ఆవిడ చిట్టితల్లి పోలీసు దగ్గరకెళ్ళి కేసు పెట్టిస్తుందా? కోర్టుకెక్కిస్తుందా! ఆధారాలు లేని ఈ నిజాలు పోలీసోడికో నాలుగు రూపాయలు తెస్తాయేమో గాని చిట్టితల్లికి న్యాయం తేలేవు అనుకున్నాను.

బోడిపాలెంలో కంటి శిబిరం మర్నాడు ఎత్తేస్తారనగా ఆ రోజు చంద్రంబాబు చాలా హుషారుగా వున్నాడు.

"రేపే ప్రయాణం. సామాన్లు సర్దేయ్" అన్నాడు. నర్సులు మధ్యాహ్నం బస్‌కెళ్ళిపోయారు.

సాయంత్రం.. చంద్రంబాబు "కంట్లో ఏదో పడింది చూడు" అన్నాడు.

ఏం పడిందో తెలవదు కాని కన్ను మాత్రం ఎర్రబడింది.

తెల్లారేసరికి కళ్ళు మందారపువ్వుల్లా అయిపోయాయి. అప్పుడనిపించింది నాకు దేవుడు చచ్చిపోలేదు. ఆక్సిజన్ మీద బ్రతికి ఎక్కడో వున్నాడని.

ఆ స్థితిలో డ్రైవింగ్ చేయలేక బాబు, నేనూ బోడిపాలెంలో ఆగిపోవాల్సి వచ్చింది. ఫోనుచేసి చెప్పగానే కౌసల్యమ్మ కంగారుపడింది.

"సరే.. నీ తెలివి వాడి, ఇంగ్లీషు వైద్యం చెయ్యకు. వేడిచేసి కళ్ళు కలిగేయనుకుంటా! వాచ్‌మన్‌ని ఊళ్లోకి పంపి, చనుపాలు తెమ్మను. అవి పోయించుకో" అని చెప్పిందామె.

దాంతో చనుపాలు కోసం నేను బోడిపాలెం అంతా తిరిగేను. ఊళ్ళో వున్న పిల్లల తల్లులే తక్కువ. కొందరున్నా ఆళ్లంతా పొలాల్లో కూలికెళ్ళిపోయారు. ఇద్దరు, ముగ్గురు, చిట్టితల్లి పేరు చెప్పారు.

భూమి గుండ్రంగా వుందనే మాట నిజమనిపించింది. భయపడుతూ వెళ్ళి చిట్టితల్లిని అడిగేను.

చిట్టితల్లి నోరిప్పకుండానే ఆమె పక్కవాటాలో వున్న వంటలక్క, దెయ్యంలా మీదపడింది.

"వీల్లేదు. వెళ్ళు ఆడికి పాలుపోస్తే పాముకి పాలు పోసినట్టే" అంటూ అరచింది.

ఆ మాట నిజమే అనిపించే నేను వెనక్కి తిరగబోతుంటే చిట్టితల్లి.. "గంటలో వస్తా.. నువ్వెళ్ళు" అంది. తెల్లబోవడం నా వంతు అయింది.

"బాబు ఒక్కడే వున్నాడా!" అని అడిగింది. తలూపేను.

"తానం ఆడి వస్తాలే" అంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది. వెళ్ళేముందు చిరునవ్వు నవ్వింది. మా బాబు మోజులో అది పడిపోయిందని నేను నిరుకు చేసుకున్నాను. దాని గుమ్మంముందు కాండ్రించి ఉమ్మి నేను వెనక్కి తిరిగేను.

రాబోయే మనిషి చిట్టితల్లి అని చెప్పగానే చంద్రంబాబు చాలా సరదా పడ్డాడు. ఎర్రగా వున్న ఆ కళ్ళు ట్రాఫిక్ ఎర్రలైట్లలా వెలిగేయి.

"పాలు స్వయంగా పిండుద్దా" అంటూ నవ్వేడు.

"వసతోందిగా.. అదుగు, కాదనేలా లేదు" అంటూ నేను వెళ్ళిపోయాను.

గంత తర్వాత చిట్టితల్లి తానం ఆడి, కొత్త చీర కట్టుకుని వచ్చింది. పెళపెళలాడుతూ పచ్చి చెక్కలా వుంది. బాబు వున్న గదిలోకి వెళ్ళింది.

ఆ క్షణం.. ఈ లోకం అంతా దేవుడు వున్నోడి కోసమే సృష్టించేడనిపించింది. ఆడి ఉపయోగానికి, ఆడి సేవకి.. మనందర్నీ పుట్టించేడనిపించింది.

అంతా చేసి అయిదు నిమిషాలు కాకుండానే గదిలోంచి మూలుగులు వినిపించేయి. ఆ మూలుగులు.. కేకల్లోకి మారేయి. ఆ కేకలు పెనుకేకలకి దారితీశాయి.

ఏమైందో నాకు అర్థం కాలేదు కాని ఆకాశం మాత్రం ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఆనందంగా చూస్తోంది. గాలి ఊపిరి వదలడం మానేసి చూస్తోంది. చెట్లు తలలు కదపడం ఆపేసి సోద్యం చూస్తున్నాయి.

"బాబోయ్.. ఏంటి పోశావ్? నా కంట్లో ఏంటి పోశావ్?.. నీ అమ్మ.." చంద్రంబాబు బూతులు తిడ్తున్నాడు.

"మూలిక కలిపిన జిల్లేడు పాలు పోశాను. నీ కళ్లు మూసుకుపోతాయి. నువ్వింక ఏ ఆడదాన్ని చూడలేవు, ఎవడి కళ్ళు తియ్యలేవు. ఇది నిజం.. కావాలంటే నిన్ను సంపగలను కాని నీ తల్లి పేగు మండించి ఆ పాపం నేనెందుకు కట్టుకోవాలి" అంటూ చిట్టితల్లి గదిలోంచి బయటకొచ్చింది. అమ్మతల్లిలా వచ్చింది. పైడితల్లిలా వెళ్ళిపోయింది.

నాకు తెలియకుండానే నా చేతులు దగ్గరయ్యేయి. వెళ్లే తల్లికి దండం పెట్టాను.

లోపల ఆకాశం చిల్లుపడేలా... చంద్రంబాబు గ్రహణం పట్టి అరుస్తున్నాడు.. ఇంకా అరుస్తున్నాడు. ◆

